# మాతృ ప్రేమ

ఇంటర్మీడియట్ రిజల్టు వచ్చాయి. పరీక్షకు వెళ్ళిన విద్యార్థులు కిల్లీకొట్టు దగ్గర పేపరులో ఒక్కొక్కరే వాళ్ళ నెంబరు చూసుకుంటున్నారు. కొందరికి పరీక్షలు పాసయ్యాయి. మరి కొందరివి పోయాయి. పాసయిన వాళ్ళు ఎగిరి గంతులేస్తూ వాళ్ళకు తెలిసిన వాళ్ళందరికీ సంతోషంతో చెప్పుకుంటున్నారు.

పరీక్ష పోయినవాళ్ళు తలలు దించుకుని అక్కడ నిలబడక ఎవరి దారిన వారే వెళుతున్నారు.

పరీక్ష పోయినవారిలో గిరీశం ఒకడు. గిరీశం తండ్రి వెంకట్రావు ముక్కోపి. పరీక్ష పోయిందని తెలిస్తే ఒళ్ళు తెలియకుండా చితక్కొడతాడు. ఆ సమయంలో అతనికి దయాదాక్షిణ్యాలుండవు. "పరీక్ష తప్పినవాడు, చచ్చినవాడు ఒకటే" అని అంటాడు. ఆ విషయం గిరీశానికి బాగా తెలుసును. గతంలో పదవ తరగతి కూడా పోయినపుడు తండ్రి పెట్టిన చిత్రహింస తనకింకా గుర్తుంది.

గిరీశంతో పాటు వాడి స్నేహితుడు శంకరం పరీక్ష కూడా పోయింది. కొంతసేపు యిద్దరూ ఒకరి ముఖం ఒకరు చూసుకుని ఏడుపులాంటి నవ్వు నవ్వారు.

"పోదాం రా" అన్నాడు శంకరం గిరీశాన్ని.

"నేనింక ఇంటి ముఖం చూడను. నువ్వెళ్ళు" అన్నాడు గిరీశం. శంకరం కొంతసేపు వాడిని రమ్మని బ్రతిమాలి, వాడు రాకపోవడంతో ఇంటికి వెళ్ళిపోయాడు.

* * *

ఆఫీసుకు వెళ్ళగానే కొడుకు పరీక్ష పోయిందని పేపర్లో చూసి తెలుసుకున్నాడు వెంకట్రావు. సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి రాగానే "ఏడే నీ సుపుత్రుడు" అని కోపంగా అడిగాడు భార్యను.



"వాడి పరీక్ష పోయిందట. ఇంట ముఖం చూడనని చెప్పి ఎక్కడికో పోయాడుట" ఏడుస్తూ చెప్పింది వెంకట్రావు భార్య.

వెంకట్రావు కోపం క్షణంలో చల్లారి పోయింది.

"ఆ సంగతి నీకెవరు చెప్పారు" అన్నాడు.

"ప్రక్కింటివాళ్ళ శంకరం. వాడి పరీక్ష కూడా పోయిందట" అంది.

కొడుకు ఎక్కడికైనా పారిపోయాడో, లేక ఏ అఘాయిత్యం చేశాడో అని వెంకట్రావు బెంబేలు పడి వాడిని వెతకడం కోసం బయలుదేరాడు.

గుమ్మం దిగుతూ వుండగా "ఏమండీ" అని పిల్చింది భార్య.

"ఏం" అన్నాడు దిగులుగా ముఖం పెట్టి.

"మీరెక్కడికని వెళ్తారు, ఏం చేస్తారు. వాడి పరీక్ష పోతే మీరు చావబాదుతారని భయపడిపోయాడు. ఆ క్షణంలో మీరు కొంచెం శాంతం వహించాలి గాని పిల్లాణ్ని కొడితే పరీక్ష పాసవుతాడా?"

"నిజమే, నాకు బుద్ధొచ్చింది. భగవంతుడి దయ వలన వాడు కనబడితే అంతే చాలు. ఇంకెప్పుడూ ఏమీ అనను" కళ్ళు తుడుచుకున్నాడు వెంకట్రావు.

"ఒరేయ్ గిరీశం, బయటకురా! మీ నాన్నగారు నిన్నేమీ అనరు" అని పిలవడంతో అంతవరకూ అక్కడే మంచం క్రింద దాక్కున్న గిరీశం బిక్కమొహంతో బయటకు వచ్చి తండ్రి ముందు నిలబడ్డాడు.

'పరీక్ష పోయిన పిల్లల పాలిట హిరణ్యకశిపులు కాకండి తండ్రులూ' అని చెప్పడమే ఈ కథ ఉద్దేశం.

—భైరి సత్యనారాయణ

## కాలమ్ దాటిన కథలు

# "ఉపాయం"

"అక్కా బావ పార్వతితో మాట్లాడుతున్నా"డంటూ పన్నెండేళ్ళ రమ పరుగెత్తుకుంటూ వచ్చి చెప్పేసరికి సుగుణకు కోపంతో, ద్వేషంతో మనసు భగ్గున మండిపోగా లోపలికెళ్ళి తల్లికి చెప్పింది.

సావిత్రమ్మ చేస్తున్న పని ఆపి గబగబ సందు మలుపు దగ్గరకెళ్ళి చూసింది. తన అల్లుడు వెంకటేశం వూళ్ళో వేశ్యగా పేరొందిన పార్వతితో ఏదో అంటుంటే అది విరగబడి నవ్వుతోంది.

అప్పటివరకూ వాళ్ళూ, వీళ్ళూ అంటుంటే వినడమే. ఇప్పుడు కళ్ళారా చూశాక ఆమెకూ కోపం వచ్చింది. ఏమైనా సరే ఈ రోజే తన భర్త నరసింహానికి చెప్పి అల్లుడి సంగతేమిటో తేల్చాల్సిందే అనుకుని వడివడిగా నడచి ఇల్లు చేరుకుంది. తల్లీ కూతుళ్ళు కలిసి ఆ విషయాన్ని గురించి బాగా వర్ణించుకుని ఓ నిర్ణయానికి వచ్చారు. నరసింహం ఇంటికి రాగానే అంతా చెప్పారు.

మామా, అల్లుడూ కలిసి భోజనాలు చేస్తుండగా కూర వడ్డిస్తూ అడిగింది సావిత్రమ్మ "పార్వతితో మాట్లాడుతున్నావేమిటి?" అని.

"అయిదు రూపాయిల చిల్లరడిగితే ఇవ్వా"నన్నాడు వెంకటేశం.

"ఇవాళ చిల్లరడిగి వుండవచ్చు కాని, రోజూ మాట్లాడుతోందని చూసిన జనం చెప్పుకుంటున్నారు. దానికేమంటావ్?" అన్నాడు నరసింహం. వెంకటేశం మాట్లాడలేదు.

"దాని జత మరిగి వేళకు ఇంటికి రాకుండా నా డబ్బంతా నాశనం చేస్తున్నా"డంటూ సుగుణ మొగుణ్ణి శాపనార్థాలు పెడుతూ శోకాలు పెట్టి ఏడుస్తుంటే నరసింహం మండిపడుతూ "మీ గోల మేం భరించలేం గాని నీ పెళ్లాం, పిల్లల్ని తీసుకుని మీ వూరుపోయి బతుకు" అన్నాడు.

వెంకటేశం వులుకూ పలుకూ లేకుండా భోజనం పూర్తిగా చేయకుండానే లేచిపోయాడు.

* * *

ఇక్కడుంటే బాగుపడడని, ఆ వూరికి ఐదు మైళ్ల దూరాన వున్న అతని సొంత వూళ్ళో అయిదువేల రూపాయిలు ఖర్చు పెట్టి సైకిల్ షాపు పెట్టించి కూతుర్ని, అల్లుణ్ణి సాగనంపాడు నరసింహం.

వెంకటేశానికి తండ్రి లేడు. తల్లి వుంది. పెళ్ళయ్యాక సుగుణ అత్తవారింటికి రానవడం, మామ సైకిల్ షాపులో పని ఇప్పించడంతో కొత్త మోజులో వెంకటేశానికి అత్తవారిల్లు బాగానే అనిపించింది. కొన్నాళ్ళయాక అతన్ని ఇంటి పెద్ద పాలేరువలె ప్రతి పనినీ చెయ్యమనడం, భార్యా, అత్తగారూ ఏమాత్రం గౌరవం అన్నది లేకుండా హీనంగా చూస్తుంటే కుక్క కంటే హీనమైన బ్రతుకైంది అతనిది.

మనసులో బాధ ఓ స్నేహితుడికి చెప్పుకుని ఏదన్నా ఉపాయం చెప్పమన్నాడు. వంద రూపాయిలుంటే నీ సమస్య పరిష్కారమై పోతుందన్నాడతను. వెంటనే తీసిచ్చాడు.

అతను పార్వతిని కలసి "చెల్లెమ్మా! నువ్వు నడిరోడ్డులో నలుగురూ తిరిగేచోట వెంకటేశంతో నవ్వుతూ నాలుగుసార్లు మాట్లాడావంటే అతని కష్టం గట్టెక్కి సంసారం చక్కబడుతుంద"ని వంద నోటు ఆమె చేతిలో వుంచాడు.

చాలా కొద్ది రోజుల్లోనే వాళ్ళనుకున్న ఫలితం కనిపించడం, సుగుణ భర్తతో కాపురానికెళ్ళడం చక చక జరిగిపోయింది.

సొంత వూళ్ళో, సొంత ఇంట్లో కన్నతల్లి దగ్గర భార్యా, బిడ్డలతో వెంకటేశం జీవితం సుఖంగానూ, సంతోషంగానూ గడిచిపోతుంటే చక్కటి ఉపాయం చూపిన స్నేహితుడికి, పార్వతికి మనసులోనే కృతజ్ఞత తెలుపుకున్నాడు వెంకటేశం.

—కామినేని కృష్ణకుమారి